
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

శుక్రవారం 8 మార్చి 2024

వైఎస్సార్ చేయూత పంపిణీ



మెగా చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్

కడప(కలెక్టరేట్), మార్చి 7: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకం జిల్లాలో వేలాది మంది మహిళల కుటుంబాల్లో వెలుగులు నింపుతోందని జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా కాశీంకోట బహిరంగ సభ నుంచి వైఎస్సార్ చేయూత సాయం మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి వేశారు. కార్యక్రమానికి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ఉద్యాన సలహా దారు శివప్రసాద్‌రెడ్డి, డీఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, సురేశ్‌రెడ్డి, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు డాక్టర్ వెంకటసుబ్బయ్య, జయసింహా హాజరయ్యారు. సీఎం కార్యక్రమం ముగిసిన అనంతరం 4వ విడత వైఎస్సార్ చేయూత పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 91,767 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.172.06 కోట్ల మెగా చెక్కును అతిథులతో కలసి జేసీ అందజేశారు.

జనం సొమ్ముతో.. జగన్ భజన

వలంటీర్లు.. అంటే ప్రతిఫలం ఆశించకుండా ప్రజాసేవ చేసేవారు. ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా జనం కోసం పనిచేసేవారు. ఇది గతంలో.. జగన్ సీఎం అయిన తరువాత వలంటీర్లు అనే పదానికి అర్థం లేకుండా పోయింది. జగన్ తన రాజకీయ భవిష్యత్తు కోసం వలంటీరు వ్యవస్థ తెచ్చి.. జనం సొమ్ముతో జీతాలు ఇస్తూ.. వారిని జనం సేవ పేరిట సొంత పార్టీ కోసం, ప్రత్యర్థులను ఇబ్బందిపెట్టేందుకు ఉపయోగించుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. కొందరు వలంటీర్లు వైసీపీ నేతలు చెప్పిన అడ్డగోలు పనులు చేయకుండా గమ్మున ఉంటే కొందరు మాత్రం బరితెగించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కొందరు వలంటీర్ల అరమాటల ద్వారా కుటుంబ సంబంధాలు దెబ్బతిన్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి.

- ఇదీ ఇప్పుడు వలంటీర్ల విధులు
- ఎన్నికల ముంగిట మరోసారి మోసం చేసేందుకు..
- మీకు జరిగిన లబ్ధి ఇదీ అంటూ ఇంటింటికీ వలంటీర్లు
- జనం సొమ్ముతో జీతాలు తీసుకుంటూ...
- ఇప్పటికే గడప గడప పేరుతో ఇంటింటికీ



(కడప-ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ పాలనలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నెలకు రూ.5వేలతో 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. వలంటీర్‌గా ఎంపిక కావాలంటే మొట్టమొదటి అర్హత వైసీపీకి అనుకూలంగా ఉండటమే అన్నది బహిరంగ రహస్యం. వీరికి నెలకు ఇచ్చే రూ.5వేలు వైసీపీ పార్టీ ఫండ్ నుంచి ఇవ్వడం లేదు. ప్రజలు కట్టే పన్నుల నుంచి ప్రభుత్వమే వీరికి జీతాలు చెల్లిస్తుంది. కాగా.. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, ఇతరత్రా సమాచారమంతా వలంటీర్ల ద్వారానే సేకరిస్తూ వస్తున్నారు. ప్రతి ఇంటి గుట్టు వలంటీర్ల చేతుల్లోనే ఉంది.. అంటే ఆ కుటుంబంలో తినే ఫుడ్డు, చదివే పేపరు, ఉండే కుటుంబసభ్యులు, ఇతరత్రా పూర్తి సమాచారం వారి చేతుల్లో ఉంది. దీనిని అడ్డు పెట్టుకుని కొందరు వలంటీర్లు బరితెగిస్తున్నారనే విమర్శ ఉంది. ప్రజల సొమ్ముతో నెలనెలా రూ.5వేలు తీసుకుంటూ కొందరు వలంటీర్లు బరితెగింపుగా వైసీపీ గడప గడప కార్యక్రమంలో పాల్గొనడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఇది చాలదన్నట్టు వైసీపీ ప్రభుత్వంలో మీకుటుంబానికి చేకూరిన లబ్ధి ఇదీ అంటూ ప్రతి ఇంటికీ వలంటీర్లు వెళ్లి మరోమారు జగన్ భజన చేయనున్నారు. మరోవారంఓ ఎన్నికల షెడ్యూలు రానుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నిలకు ముందు కూడా వలంటీర్లను పార్టీ కార్యకర్తల్లా వాడుకోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పథకాలు ఇస్తున్నారు కదా.. ఇంటి వద్దనే ఉండండి

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు దివంగత ఎన్టీఆర్ హయాం నుంచి అమలులో ఉన్నాయి. రాజశేఖర్‌రెడ్డి పాలనలో రూ.75 ఉన్న పింఛన్‌ను చంద్రబాబు రూ.వెయ్యికి పెంచారు. ఆయన పాలనలోనే దాన్ని రూ.2వేలు చేశారు. అయితే జగన్ సీఎం అయ్యాక సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ అనుకుంటూ ఫోజులు కొడుతున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన పింఛన్లు, స్కాలర్‌షిప్‌లు, మెస్‌చార్జీలు, విదేశీ విద్య, రుణ మాఫీ, రైతు భరోసా ఇతరత్రా వాటిని పేరు మార్చి.. వాటన్నింటికీ జగనే అంబాసిడర్‌గా చెప్పుకుంటూ వస్తున్నారు. త్వరలో ఎన్నికలు రానున్నాయి. ఇప్పటికే వైసీపీ గడప గడపకు కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా సదరు ఎమ్మెల్యే ఏ ఊరిలో అయితే తిరుగుతారో అక్కడి జనాలకు వలంటీర్లు ముందుగానే ఫోన్ చేస్తున్నారు. ఎమ్మెల్యే వస్తున్నారని ఇంటి వద్దనే ఉండాలని చెబుతున్నారు. తమకు ఏదైనా పని ఉందని ఎవరైనా అంటే.. పథకాలు ఇస్తున్నారు కదా.. ఇంటివద్దనే ఉండండి అని దబాయిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. అలంఖాన్‌పల్లెలో రెండురోజుల క్రితం డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పర్యటించారు. డిప్యూటీ సీఎం వస్తున్నారు.. ఇంటి వద్దే ఉండండి అని వలంటీరు అక్కడున్నవారికి ఫోన్ చేశారు. బయట ఉన్నామంటే మీకు ఇంత లబ్ధి అందింది కదా.. డిప్యూటీ సీఎం వస్తున్నారని ముందే చెప్పాం.. ఇంటిదగ్గర ఉండకుంటే ఎలా అని ప్రశ్నించారు.



రెండురోజుల క్రితం బ్రహ్మంగారిమఠం మండలం నాగిశెట్టిపల్లెలో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం అంటూ వైసీపీ నేతలతో కలసి నినాదాలు చేస్తున్న వలంటీర్లు

నవరత్నాల పేరుతో నయా మోసం

జనానికి ఎన్ని అబద్ధాలు చెప్పినా నమ్ముతారని జగన్ అండ్ కో భావిస్తున్నట్లు ఉన్నారు. సాక్షి పత్రిక, సాక్షి టీవీ జగన్ సొంతం. అయినా ఆయన మీటింగుల్లో నాకు పేపరు లేదు, టీవీ లేదు అంటూ చెప్పుకొస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్, కాస్మటిక్స్‌చార్జీలు విద్యార్థులకు నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యేవి. అయితే ఇప్పుడు జగన్ అండ్ కో నవరత్నాల పేరుతో సంక్షేమాన్ని డివైడ్ చేసి మీ కుటుంబానికి ఇంత లబ్ధి చేకూర్చామంటూ చెప్పుకొస్తోంది. జనాలకు నేను పథకాలు ఇస్తున్నాను, నేను ఏం చెప్పినా నమ్ముతారనే భావనలో జగన్ ఉన్నారంటారు. జగన్ పాలనలో జనం డేటా అంతా వలంటీర్ల చేతుల్లో ఉందంటారు. ఇంటింటికీ వెళ్లి మీ ఇంటికి ఇంత వచ్చింది.. లబ్ధి ఇంత పొందారు అని వివరించాలని వలంటీర్లను వైసీపీ పెద్దలు ఆదేశిస్తున్నారు. గత కొన్నేళ్లుగా.. అంటే 1983 నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను జగన్ కిచిడీగా చేసి నవరత్నాల పేరుతో మీ ఇంటికి ఇంత చేశామని చెబుతున్నారు. పిల్లలు లేకున్నా అమ్మఒడి ఇచ్చినట్లు చెప్పడం చూసి జనం అవాక్కవుతున్నారు.

జగన్ భజన

ప్రభుత్వ సొమ్మంటే వైసీపీకి తమ జేబులో డబ్బుగా భావిస్తున్నట్లు ఉందంటారు. అడ్డగోలుగా జనం సొమ్ము ఖర్చు చేస్తున్నారనే విమర్శ ఉంది. వలంటీర్లు ఇంటింటికీ వెళుతూ ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి ఇంత లబ్ధి చేకూరింది అంటూ మరోసారి జగన్ భజన చేయనున్నారు. ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం, మేం సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమాల పేరిట ఇంటింటికీ వెళ్లి జగన్ భజన చేశారు. ఇప్పుడు మళ్లీ జగన్ భజన చేయాల్సి రావడం చూసి కొందరు వలంటీర్లు వామ్మో అంటున్నారు.

మహిళలు అన్నింటా సమానమే

- జిల్లా సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప(కలెక్టరేట్), మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో సమానులనీ, లింగ వివక్ష తగదని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్‌జడ్జి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు సమానంగా రాణిస్తున్నా లింగవివక్ష కొనసాగుతుండడం విచారకరమన్నారు. 1996 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటూ మహిళల హక్కులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వివక్ష, లింగనిష్పత్తిపై అవగాహన, కుటుంబంలో మహిళ పాత్ర, వివాహ వయస్సు తదితర విషయాలను ఆయన వివరించారు. మహిళలు హింసకు గురైనపుడు గృహహింస చట్టం ద్వారా రక్షణ, మనోవర్తి పొంద వచ్చన్నారు. మహిళల హక్కులు, చట్టాలు, సీనియర్ సిటిజన్ యాక్టు గురించి వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధ శాఖలలో ఉత్తమ ప్రతిభ చూపిన మహిళా ఉద్యోగులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, జాయింట్ డైరెక్టర్‌లు, వివిధ శాఖల అధికారులు, మహిళా డాక్టర్లు, మహిళా ఎన్జీవోలు, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి చేదు అనుభవం

- నీటి సమస్యపై నిలదీసిన వైసీపీ కార్యకర్త



తమకు నెలరోజులుగా నీరు రాలేదని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని నిలదీస్తున్న వైసీపీ కార్యకర్త

కడప, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. మైలవరం మండల పరిధిలోని వద్దిరాల గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ఆంధ్రజ్యోతి దినపత్రికలో రెండు రోజుల క్రితం వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో గురువారం వద్దిరాలలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ వైసీపీ కార్యకర్త మాట్లాడుతూ.. నెల రోజుల నుంచి గ్రామంలో నీరు రాలేదని, మాఊరికి ఏమి చేశారని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. తాను వైసీపీకి ఓటు వేశానని నీరు రాలేదని అడిగే హక్కు తనకు ఉందన్నారు. నీళ్లు వస్తాయిలే అంటూ మండల నాయకులు అంటుండగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటిన్నర పెట్టి పైప్ లైన్ వేశానని, రోడ్లు వేశానని మీఊరికి సమస్య తీర్చింది తానేనంటూ అసహనంతో మాట్లాడుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే అసహనంతో మాట్లాడిన మాటలు గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

కడప ఆర్టీసీ బస్టాండు వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తున్న భక్తులు



బాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు : పుత్తా

- వైసీపీ సర్పంచ్‌తో పాటు 150 కుటుంబాలు టీడీపీలో చేరిక



పుత్తా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్ సుజాతమ్మ, తదితరులు

సీకేదిన్నె, మార్చి 7: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడితోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి పంచాయతీలో గురువారం బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కొప్పర్తి రేడియోస్టేషన్, బీసీ కాలనీ తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వైసీపీ కొప్పర్తి సర్పంచ్ కోకటం సుజాతమ్మ, కోకటం ఈశ్వర్‌రెడ్డి కుటుంబంతో పాటు 150 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పుత్తా మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో నడిపించాలంటే అది కేవలం చంద్రబాబుకే సాధ్యమవుతుందని అన్నారు. ప్రజలు టీడీపీ, జనసేన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుత్తా చైతన్యరెడ్డి, డాక్టర్ క్రిష్ణకిశోర్, పీవీ సుబ్బారెడ్డి, గంధం మోహన్ బాబు, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలతల క్షేత్రంలో ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు

కడప(కల్చరల్)/పెండ్లిమర్రి, మార్చి 7: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతలలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గురువారం భక్తులు కోనేరులలో స్నానాలు ఆచరించి పొలతల మల్లేశ్వరస్వామి, అక్కదేవతలు, బండన్నస్వాములను దర్శించుకున్నారు. శుక్రవారం స్వామి అమ్మవార్ల కల్యాణంతో పాటు రాత్రికి అక్కదేవతల గుడి వరకు పల్లకిలో స్వామివారి ఊరేగింపు ఉంటుంది. శనివారం ముగింపు ఉత్సవాలు జరగనున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పోటెత్తిన భక్తులు: మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని వివిధ శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. గురువారం మధ్యాహ్నం నుంచి శైవక్షేత్రాలకు పెద్ద ఎత్తున భక్తులు బస్టాండుకు చేరుకుని తరలివెళ్లారు శుక్రవారం పరమశివుని సందర్శించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ముఖ్యంగా పొలతల, నిత్యపూజకోన, సంగమేశ్వర దేవాలయాలు, అల్లాడుపల్లె, నాగనాధీశ్వర దేవస్థానం, లంకమల తదితర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆర్టీసీ బస్టాండు కిటకిటలాడింది.

జగన్ అరాచకపాలనకు తెరపడనుంది

- బాలుడిని రాచమల్లు హింసించడం సంస్కారహీనం
- మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 7: కొద్ది రోజుల్లో రాష్ట్రంలో జగన్ అరాచపాలనకు తెరపడనుందని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించడమేకాకుండా ప్రభుత్వ ఆస్తులైన సచివాలయాన్ని సైతం బ్యాంకులకు తాకట్టు పెట్టారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున వైసీపీ నేతలు వలంటీర్లకు వెలుగు సిబ్బందికి తాయిలాలు పంచుతున్నారన్నారు. సాక్షి దినపత్రికలో ఒక్కతేది తప్ప అందులోని వార్తల్లో ఒక్కనిజంలేదని అన్నీ అబద్ధాలు వండివార్చుతారన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు అరాచకాలు అవినీతి దందాలపై ఆంధ్రజ్యోతిలో కథనం రాస్తే వార్తను జీర్ణించుకోలేక ఆ పత్రిక అధిపతిపై దుర్భాషలాడటం, ఆ పేపరును అవమాన పరిచేందుకు బాలుడిని బట్టలూడదీసి హింసించడం సంస్కారహీనమన్నారు. రాచమల్లు అరాచకాలపై ప్రొద్దుటూరు ప్రజలు త్వరలోనే రెఫరెండం ఇస్తారన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అమీర్‌బాషా, జనసేన పార్టీ ప్రతినిధి మంచి శివకుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలపై ఆందోళన



- ప్రతి ఉద్యోగికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల బకాయిలు
- 11వ పీఆర్సీ బకాయిలూ పెండింగ్‌లోనే
- ఉద్యోగులు దాచుకున్న సొమ్మును లాగేసుకున్న ప్రభుత్వం
- ఈ ఐదేళ్ల బకాయిలను వైసీపీ ప్రభుత్వమే చెల్లించాలంటున్న ఉద్యోగ సంఘాలు

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 7: ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలపై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఫ్రెండ్లీ ప్రభుత్వంగా చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉద్యోగులకు మేలు జరగకపోగా వారికి చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. ఎన్నికల వేళ అయినా ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తుందో లేదోనని.. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారితే బకాయిల పరిస్థితి ఏమిటని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రివర్స్ పీఆర్‌తో నష్టపోయిన ఉద్యోగులు ఎన్నికలు వస్తే ఈ ప్రభుత్వాన్ని సాగనంపడానికి క్యాలెండర్‌లో తేదీలు తిప్పుతున్నారు.

కరువు భత్యం ఇవ్వని ప్రభుత్వం

2018 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన కరువు భత్యం బకాయిలు ప్రభుత్వం చెల్లించలేదు. 2018 నుంచి 2022 వరకు ప్రకటించిన డీఏలను 11వ పీఆర్సీలో కలిపి డీఏ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం దాటవేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఒక శాతం డీఏ ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం 0.921 శాతం డీఏ చెల్లించాల్సి ఉంటుంది. దీనిని పెన్షనర్లకు నగదు రూపంలో, సీపీఎస్ ఉద్యోగులకు 90 శాతం నగదుగాను, 10 శాతం మొత్తాన్ని వారికి సీపీఎస్ ఖాతాలకు జమ చేయాలి. ఇతర ఉద్యోగులకు పీఎఫ్ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. అయితే డీఏ బకాయిలను ఇంతవరకు చెల్లించకపోవడంతో ప్రతి ఉద్యోగికి ప్రభుత్వం దాదాపు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పేరుకుపోయాయి. తాజాగా 2023 జనవరి నుంచి జూలై నెల వరకు డీఏను కేంద్రం ప్రభుత్వం ప్రకటించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు.

11వ పీఆర్సీ బకాయిలూ పెండింగ్

12వ పీఆర్సీ కమిషన్ వేసిన ప్రభుత్వం 11వ పీఆర్సీ బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లోనే పెట్టింది. ఉద్యోగుల ఒత్తిడితో ఆ బకాయిలను నాలుగు వాయిదాల్లో చెల్లిస్తామన్న ప్రభుత్వం వాయిదాల పద్ధతిలో చెల్లిస్తోంది. ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించాలన్న ఉద్యోగ సంఘాల వినతిని పట్టించుకోవడం లేదు. ప్రతి ఉద్యోగికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు పీఆర్సీ బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

రుణాల కోసం ఉద్యోగుల అవస్థలు

కుటుంబ అవసరాలకు రుణంకోసం దరఖాస్తు చేసుకున్నా రుణం రాక ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ఉద్యోగులు పీఎఫ్ ఖాతాలో తమ జీతంలో కొంత మొత్తాన్ని దాచుకోవడం పరిపాటి. అలా దాచుకున్న సొమ్మును పిల్లల చదువులు, పెళ్లిళ్లు, వైద్య ఖర్చులు వంటి అవసరాలకు రుణం రూపంలో తీసుకోవడం సర్వసాధారణం. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పీఎఫ్ రుణం కోసం దరఖాస్తు చేస్తే సంవత్సరం పాటు రుణం ఇవ్వకుండా కాలం వృధా చేస్తున్నారు. తాము దాచుకున్న సొమ్ము సమయానికి అందకపోవడంతో అప్పులు చేసి వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు తమ సర్వీసు కాలంలో మిగిల్చుకున్న ఆర్జిత సెలవులను అవసరమైనప్పుడు నగదుగా మార్చుకునే అవకాశం ఉంది. నగదుగా మార్చుకోవడానికి బిల్లు చెల్లించిన ఒకటి రెండు నెలల్లో వారి ఖాతాకు డబ్బు జమ చేయాల్సి ఉంటుంది. అయితే ఖజానాలో బిల్లు సమర్పించిన తర్వాత డబ్బులు ఇస్తామని కానీ లేదా ఆ బిల్లు రద్దు చేస్తామని కానీ చెప్పకుండా అలాగే పెండింగ్‌లో పెడుతున్నారు. మరో నెల రోజుల్లో వైసీపీ ప్రభుత్వం గడువు తీరిపోనుంది. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు, కార్మికులకు దాదాపు రూ.30 వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. మరో వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుండడంతో ఆర్థిక బకాయిలు వస్తాయో రావో నన్న ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది. బకాయిలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఈ ప్రభుత్వంలోని బకాయిలను ఈ ప్రభుత్వమే చెల్లించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అప్పు చేయాల్సి వస్తోంది

- కేజే రఘురామిరెడ్డి, ఏపీఎన్జీవో అసోసియేషన్ ప్రొద్దుటూరు అధ్యక్షుడు



సకాలంలో ఆర్థిక బకాయిలు అందకపోవడంతో ఉద్యోగులు కుటుంబ అవసరాల కోసం అప్పు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు బకాయిలు చెల్లించాలి. లేదంటే ఉద్యోగుల అసంతృప్తిని మూటగట్టుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలి.

బకాయిలు వెంటనే చెల్లించాలి

- శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ఈ ప్రభుత్వం చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలు ఈనెల చివరి నాటికి చెల్లించాలి. పీఎఫ్, ప్రభుత్వ జీవిత బీమా రుణాలు, సరెండర్‌లీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలి. ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలి.

1వ తేదీనే పెన్షన్ చెల్లించాలి

- లక్ష్మణ్, పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి



విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ పైనే ఆధారపడి జీవిస్తున్నందున 1వ తేదీనే పెన్షన్ చెల్లించాలి. వైసీపీ ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగులకు క్వాంటమ్ పరిమితిని 7, 12 శాతానికి తగ్గించడం వలన ఆర్థికంగా నష్టపోయాం. గతంలో మాదిరిగా 10, 15 శాతానికి క్వాంటమ్‌ను పునరుద్ధరించాలి. డీఏ అరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలి.

డిగ్రీ మొదటి సెమిస్టరు ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రారు, ప్రిన్సిపల్ తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 7: వైవీయూ అనుబంధ కళాశాలల బీఏ, బీకాం, బీబీఏ, డీడీఏ, బీఎస్ హానర్స్ డిగ్రీ మొదటి సెమిస్టరు పరీక్ష ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ తన ఛాంబరులో రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డితో కలిసి ఫలితాలు వెల్లడించారు. 2023 డిసెంబరులో జరిగిన ఈ పరీక్షలకు 6789 మంది విద్యార్థులు హాజరు కాగా 3970 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 54 శాతం ఫలితాలు వచ్చాయని తెలిపారు. బీఏలో 45 శాతం, బీబీఏలో 47 శాతం, బీసీఏలో 70 శాతం, బీకాంలో 54 శాతం, బీఎస్సీలో 66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని స్పష్టం చేశారు.

మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి



ఖోఖో పోటీలలో పాల్గొంటున్న విద్యార్థినులు

కడప (స్పోర్ట్స్), మార్చి 7: మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర, జేబీవీఎస్ ది ప్రజర్వేర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నారీ శక్తి ఫిట్నెస్, నారీశక్తి వాలీబాల్, నారీశక్తి ఖోఖో తదితర క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజ పురోగతికి మహిళలే కారణమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, సమితి వ్యవ స్థాపకులు అశోక్, ఎన్‌వైకే వాలంటీర్లు, కాలేజీ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, జేబీవీఎస్ సంస్థ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కళాకారుడు మృతి



వివిధ వేషధారణలో రవికుమార్, మృతి చెందిన రవికుమార్ (ఫైల్)

మైదుకూరు, మార్చి 7: కాళికా నృత్యాలతో పాటు బృందావనంలో అఘోరా, కాంతార లాంటి విశేష ప్రజాధారణ పొందిన వేషాలు వేస్తూ పోటీలలో సరితూగిన కళాకారుడు మిరియాల రవికుమార్ (45) బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానిక కళాకారులకు నిలయమైన పార్వతీనగర్‌కు చెందిన రవికుమార్ పగటివేషాలు వేస్తూ జీవనం గడిపేవారు. బుధవారం మదనపల్లెలో ఓ కార్యక్రమం ముగించుకొని ద్విచక్రవాహనంలో తిరిగి మైదుకూరుకు తిరిగి వస్తుండగా రాయచోటి వద్ద కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రవికుమార్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం కడప ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. కాగా రవికుమార్ వివిధ వేషాలు వేస్తూ అందరి మన్ననలు పొందారు. భార్య ముగ్గురు పిల్లలున్నారు. రవి కుమార్ మృతి పట్ల అభిమానులతో పాటు పార్వతినగర్‌లోని మిగిలిన కళాకారులు రోధనలో ఉండిపోయారు.

విద్యుత్ తీగలు తగిలి విద్యార్థికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలపాలైన సింహాద్రి

బి.కోడూరు, మార్చి 7: ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగలడంతో బత్తల సింహాద్రి అనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని తంగేడుపల్లెకు చెందిన బత్తల సిద్దయ్య కుమారుడు సింహాద్రి గురువారం తన అన్న మేకలను పొలాల్లో మేపుకుంటుండగా మధ్యాహ్నం భోజనం తీసుకెళ్లాడు. ఆ సమయంలో గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాన్స్‌ఫార్మరు వద్ద తీగలు కింద పడి ఉండగా విద్యార్థి దాటే ప్రయత్నం చేయగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ తగిలి శరీర భాగాలన్నీ కాలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కాగా, సింహాద్రి బద్వేలు ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



పోలయ్య (ఫైల్)

నందలూరు, మార్చి 7: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన పోలయ్య (45) బుధవారం ఒంటిమిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆసరా డబ్బులు ఇప్పించండి..



ఏపీఎంను నిలదీస్తున్న మహిళలు

ఖాజీపేట, మార్చి 7: నెల రోజుల క్రితం ప్రభుత్వం ఆసరా 4వ విడత కింద విడు దల చేసిన డబ్బులు ఇప్పించాలని పత్తూరు డ్వాక్రామహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పత్తూరు గ్రామానికి చెందిన ఆరుడ్వాక్రా గ్రూపు సభ్యులు బ్యాంకు మేనేజర్ వద్దకు వెళ్లి ఆసరా డబ్బులు ఇవ్వాలని అడుగగా మేనేజర్ డబ్బులు ఇచ్చేది లేదని చెప్పడంతో ఆగ్రహించిన మహిళలు మండల సమాఖ్య కార్యాలయానికి వెళ్లి ఏపీఎం వెంకటరామరాజును నిలదీశారు. మేము డబ్బులు కట్టలేము, ఆనిమేటర్ సరిగా చెప్పడం లేదు, మేనేజర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. మేము నెలకు రూ.5 వేలు మాత్రమే చెల్లిస్తాం.. ఆ లోన్ తీరినంతవరకు మరో లోన్ వద్దని, ప్రస్తుతం ఉపాధి పనులు లేవని, ఎక్కువ డబ్బులు చెల్లించాలంటే మేము చెల్లించలేమన్నారు. మాకు ఆసరా డబ్బులు ఇప్పించాలన్నారు. ఇందుకు ఏపీఎం మాట్లాడుతూ బ్యాంకు మేనేజర్, గ్రూపు సభ్యులు, ఆనిమేటర్ కలిసి ఏమి తీర్మానం చేశారో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డీబార్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 7: ఇంటర్ పరీక్షల్లో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు గణితం, బాటనీ, సివిక్స్ పేపరు-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 17603 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16777 మంది హాజరయ్యారు. 826 మంది గైర్హాజరయ్యారు. కడప నగరంలో ఓ కళాశాలలో విద్యార్థి చూసి రాత రాస్తుండగా పట్టుబడి డీబార్ అయినట్లు ఆర్ఐవో తెలిపారు.

పనులు చేయకుండానే... బిల్లులు చెల్లిస్తారా?

- కౌన్సిల్ సమావేశంలో తీవ్ర దుమారం
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులకు జనరల్ ఫండ్స్ ఎలా కేటాయిస్తారు
- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

ఎర్రగుంట్ల, మార్చి 7: ఎర్రగుంట్ల నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. పనులు చేయకుండానే బిల్లులు ఎలా చెల్లిస్తారంటూ కొందరు, పాత బిల్లులకు ఇప్పుడు పేమెంట్స్ చెల్లించడమేంటని మరికొందరు ఫైర్ అయ్యారు. ఇందుకు తాము ససేమిరా ఒప్పుకోమని కౌన్సిలర్లు తేల్చి చెప్పారు. ఎర్రగుంట్ల నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం గురువారం చైర్మన్ ఎం.హర్షవర్దన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో అనేక అంశాలను కౌన్సిలర్లు వ్యతిరేకించారు. ముఖ్యంగా 2016-17లో ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.4కోట్లు మంజూరు చేశారు. అయితే ఇందుకు సంబంధించి పనులు చేసినట్లు కొంతమేర బిల్లులు కూడా చెల్లించారని.. మిగతా బ్యాలెన్స్ మొత్తాన్ని నగర పంచాయతీ సాధారణ నిధుల నుంచి చెల్లించాలని అజెండాలో చేర్చారు. అయితే ఈ విషయాన్ని 6వ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి మరికొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎప్పుడో చేసిన పనులకు ఇప్పుడు సాధారణ నిధుల నుంచి ఎందుకు చెల్లించాలని కమిషనర్‌ను ప్రశ్నించారు. అలాగే నీటి సరఫరాకు సంబంధించి లక్షలకు లక్షలు బిల్లు పెట్టారని.. దీనిపై అభ్యంతరాలున్నాయని మరికొందరు కౌన్సిలర్లు నిలదీశారు. డబ్బులు ఇప్పుడు చెల్లించమని.. కౌన్సిల్ రిజల్యూషన్ మాత్రమే కోరుతున్నామని కమిషనర్ రామక్రిష్ణ సమాధానం చెప్పడంతో కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మేము బిల్లులను పక్కన పెట్టమని చెబుతుంటే వీటిపై సీఆర్ ఎందుకని ఎదురుదాడికి దిగారు. దీనికి కో ఆప్షన్ సభ్యుడు డి.సూర్యనారాయణరెడ్డి కూడా బలపరచారు. పాత బిల్లులకు సంబంధించి ఒక్క రూపాయికూడా ప్రస్తుతం చెల్లించడానికి వీల్లేదని వారు తెల్చి చెప్పారు. తాము ఏ పనిచేయమని అడిగినా డబ్బుల్లేవని సమాధానం చెప్పే అధికారులకు సాధారణ నిధుల నుంచి ఎలా చెల్లిస్తారని ధ్వజమెత్తారు. తాము గత సమావేశంలో వ్యతిరేకించిన అంశాలను మీరే పాస్ చేసుకుంటారా అంటూ మండిపడ్డారు. ఇక మేమెందుకు.. మమ్మల్ని ఎందుకు పిలవడం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మమ్మల్ని ఆహ్వానించకుండా కించపరుస్తారా...

కౌన్సిల్ సమావేశానికి తమకు కనీసం ఆహ్వానం కూడా పంపడం లేదని కొందరు కౌన్సిలర్లు అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో కమిషనర్ జూనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. తన వద్ద నున్న ఫోన్ నెంబర్లకు వాట్సాప్ పెట్టానని ఆయన సమాధానం చెప్పడంతో.. వాట్సప్‌ల్లో పిలిస్తే మేము రావాలా అంటూ కౌన్సిలర్లు నిలదీశారు. ఇక కౌన్సిల్‌లో కౌన్సిలర్ల బంధువులను సమావేశం జరిగేట ప్పుడు లోపలికి కమిషనర్ అనుమతించారు. పైగా వారితో మాట్లాడిం చడంపై కొందరు కౌన్సిలర్లు మండిపడ్డారు. వచ్చే సమావేశానికి తాము కూడా తమ పరివారంతో వస్తామని... అప్పుడు అనుమతించకపోతే ఊరుకోమని హెచ్చరించారు.



కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

పనులెక్కడ చేశారో చూపించండి సారూ....

2016-2017లో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన నిధుల నుంచి ప్రకాష్‌నగర్‌లో, శాంతినగర్‌లో సీసీ డ్రైన్లు పెట్టినట్లు అజెండాలో ఉంచారని.. అవి ఎక్కడ చేశారో చూపించాలని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ప్రకాష్‌నగర్‌లో అసలు డ్రైన్ వేశారా... వేస్తే ఎక్కడుందో చూపించండని ఆ వార్డు ఇన్‌చార్జి ప్రశ్నించారు. అలాగే మరో చోట కూడా డ్రైన్ వేయకుండా బిల్లులు పెట్టారన్న విమర్శలపై కోఆప్షన్ సభ్యులు మండిపడ్డారు. దీనిపై విజిలెన్స్ ఎంక్వైరీ చేయాలని మరికొందరు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

ఎన్నికల విధుల్లో సమన్వయంతో పనిచేయాలి

- అన్నమయ్య జిల్లా ఎస్పీ క్రిష్ణారావు



కేంద్ర పోలీసు దళాలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటిటౌన్, మార్చి 7: రానున్న సార్వత్రిక ఎన్నికల సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర పోలీసు దళాలు, జిల్లా పోలీసులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ క్రిష్ణారావు పేర్కొన్నారు. కేంద్ర పోలీసు దళాలు జిల్లాకు వచ్చిన సందర్భంగా ఎస్పీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర పోలీసు దళాలు, పోలీసు అధికారులకు, సార్వత్రిక ఎన్నికల విధుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా భౌగోళిక పరిస్థితులు, అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు, పోలీసు సబ్‌డివిజన్లు గురించి విపులంగా తెలియజేశారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు, సిబ్బంది అత్యంత పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలు గురించి అవగాహన కల్పించారు.

వైభవోపేతం వీరభద్రుడి మహాశివరాత్రి బ్రహ్మోత్సవం

- మూడో రోజు ఘనంగా నవగ్రహ హోమం



యాళి వాహనంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, మార్చి 7: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మూడవ రోజు ఉదయం నవగ్రహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి యాలివాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ వారిచే నిర్వహించిన చెక్కభజన కార్యక్రమం భక్తులను అలరించింది. అలాగే రాత్రికి భద్రకాళీ సమేత వీరభద్రుడు సింహవాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. వాహన ఊరేగింపు సందర్భంగా వీరభద్రస్వామి భజన మండలి తుమ్మల హరినాధ ఆధ్వర్యంలో కోలాటం, వాసవీ వనిత వారిచే చేపట్టిన కోలాటం భక్తులకు ఆకట్టుకుంది. పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

74 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు

ప్రొద్దుటూరు, మార్చి 7: పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి, చంద్రమోహన్ అనే వ్యక్తులు పాండిచ్చేరి నుంచి మద్యం అక్రమంగా తీసుకువస్తుండగా ప్రొద్దుటూరులోని ఓ సర్కిల్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 74 ఫుల్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం రవాణాచేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఈబీ సీఐ మహేష్ కుమార్ తెలిపారు.

35 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం ,మార్చి 7: పట్టణంలో 35 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొర్రపాడు గ్రామానికి చెందిన ఆవుల సుబ్బరాయుడు అనే వ్యక్తి 35 మద్యం బాటిళ్లను అనుమతి లేకుండా తీసుకెళుతుండగా కొండాపురం బస్టాండులో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎఎస్సై నరసింహులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

నందలూరు, మార్చి 7: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ భగత్‌సింగ్ కాలనీకి చెందిన నాగలూరు నాగేంద్రకు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి కోలార్‌లత గురువారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు. అతన్ని రాజంపేట సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల సామూహిక దహనం



చంపిన కుక్కలను సామూహిక దహనం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, మార్చి 7: కొత్తపల్లె పంచాయితీలోని మండి మర్చెంట్ ఏరియాలో కొందరు కుక్కలను చంపి సామూహిక దహనం చేశారు. గురువారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. గత రెండు రోజులుగా కొందరు కుక్కలను చంపి ఈ ప్రాంతంలో కుప్పగా వేసి గురువారం దహనం చేసినట్లు ఆప్రాంత వాసులు తెలిపారు. అయితే ఈ కుక్కలను పంచాయతీ అధికారులే పట్టుకుని చంపారా లేదా మరెవరైనా చంపారా అనేది తెలియడం లేదు. పంచాయతీ కార్యదర్శి నరసింహులుకు ఫోన్ చేస్తే ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్‌లో వుంది. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి ఫోన్ చేసి వివరణ అడగగా తాము కుక్కలను పట్టలేదని.. వాటిని ఎవ్వరు చంపారో తెలియదని వివరణ ఇచ్చారు. ఏదేమైనా ఈ అమానుష ఘటనకు కారకులెవ్వరో పంచాయతీ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టి చట్టపరంగా శిక్షించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

విద్యుత్ వైరు చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

కొండాపురం ,మార్చి 7: మండలంలో ముంపునకు గురైన పాత తాళ్లప్రొద్దుటూరు ప్రాంతంలో విద్యుత్ వైరు చోరీ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. అనిల్, మనోహర్‌తో పాటు మరో వ్యక్తి కలిసి విద్యుత్‌స్తంభాల వైరు చోరికి పాల్పడినట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గరిపై కేసు నమోదు చేయగా, ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



ఎస్ఐ చంద్రమోహన్‌తో మాట్లాడుతున్న రైతులు

వీరబల్లి, మార్చి 7: మా ప్రాంతం నుంచి ఇసుకను తరలించవద్దంటూ గురువారం మాండవ్య నదిలోని పుల్లగూర గండి వద్ద మండల రైతులు ప్రతిమ కంపెనీ సిబ్బందిని అడ్డుకున్నారు. ఇక్కడి నుంచి ఇసుకను తరలిస్తే ఒప్పుకునే ప్రసక్తే లేదని ఇసుక రీచ్ ఏర్పాటు కోసం వచ్చిన కంపెనీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడికి విచ్చేసిన పోలీసు సిబ్బందిపై కూడా మండిపడ్డారు. అనంతరం పలువురు నాయకులు అక్కడికి చేరుకొని అధికారులతో మాట్లాడారు. మా ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటిపోయి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వాల్టా చట్టం ప్రకారం మాండవ్యనదిలో నుంచి ఇసుకను తరలించడం సాధ్యమైన పని కాదని ప్రతిమ సంస్థ సిబ్బందికి తెలిపారు. మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకోవడంతో ఎస్ఐ చంద్రమోహన్ వారితో చర్చించి ఎలాంటి సమస్య తలెత్తకుండా సర్దుబాటు చేశారు. కార్యక్రమంలో బాబురెడ్డి, వీఆర్‌డీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల టీడీపీ బీసీ నాయకులు తుమ్మల రమేశ్, ఆంజనేయులురెడ్డి, తారకేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న వైవీయూలో సీతాకోక చిలుకలపై జాతీయ కార్యశాల

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 7: వైవీయూలో జంతుశాస్త్ర విభాగం అసిస్టెంటు ప్రొఫెసరు వెంకటరమణ ఆధ్వర్యంలో ఈనెల 14న సీతాకోక చిలుకలపై జాతీయ వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన బ్రోచర్‌ను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ రిజిస్ట్రారు ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి విడుదల చేశారు. ఈసందర్భంగా చింతా సుధాకర్ మాట్లాడుతూ సీతాకోక చిలుకలపై జాతీయ సదస్సు నిర్వహించడం రెండు తెలుగు రాష్ట్రా ల్లో ఇదే మొదటిది అన్నారు. సదస్సును విజయవంతంగా నిర్వహించాలని కమిటీకి సూచించారు. కార్యక్రమంలో టీడీసీ డీన్ ప్రొఫెసరు రఘుబాబు, కార్యశాల కన్వీనరు వెంకటరమణ, జంతుశాస్త్ర విభాగం విభాగాధిపతి రామిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

- **టీడీపీ కడప అభ్యర్థి మాధవీరెడ్డి**

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 7 :చంద్రబాబుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం 34వ డివిజన్ శివలింగం బీడీ ఫ్యాక్టరీ ప్రాంతంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు అందించి అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చంద్రబాబును సీఎం చేయాల్సిన ఆవశ్యకత ప్రజలకు ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రం పది సంవత్సరాలు వెనక్కి పోయిందని, చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం అభివృద్ధిలో కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జావేద్, మన్సూర్, బుఖారి, జిలానీబాషా, అక్బర్, జాకీర్, జహీరుద్దీన్, జిమ్‌బాషా, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10వ డివిజన్‌లో...

కడప నగరం 10వ డివిజన్‌లో టీడీపీ విజయం కోసం మాధవీరెడ్డి కుమార్తె శ్రీయాంకరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో తన తల్లి మాధవీరెడ్డిని గెలిపించాలని కోరారు.

చంద్రబాబుతోనే రామరాజ్యం

రామరాజ్యం రావాలంటే చంద్రబాబు సీఎం కావాలని టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం 15వ డివిజన్, విద్యుత్‌నగర్, బహుజననగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నవనీశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రేంకుమార్, రెడ్డయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి: పుత్తా

పెండ్లిమర్రి, మార్చి 7: ప్రతి ఇంటికి సంక్షేమం-అభివృద్ధి చేరాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని కొత్తసంగటిపల్లె పంచాయతీలోని రేపల్లె, చింతలవాండ్లపల్లె, హరిజనవాడ, కొత్తసంగటిపల్లె గ్రామాలలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుత్తా నరసింహారెడ్డితో పాటు చైతన్యరెడ్డి గ్రామాలలో ఇంటింటికి తిరిగి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, సాయి నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చంద్ర ఓబుల్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, చీమలపెంట సర్పంచు ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రామాంజనేయులు, టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, సారథిరెడ్డి, ఆరవేటి చంద్రారెడ్డి, అయ్యవారురెడ్డి, లక్ష్మిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, బయన్న, గంగన్న, రాజు, బాలకృష్ణ, ఈశ్వర్‌రెడ్డి, అన్నమయ్య గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కడప: బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీలో మాధవీరెడ్డి... కార్యక్రమంలో పాల్గొన్న సానపురెడ్డి శివకొండారెడ్డి... మహిళతో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కేఎస్ఆర్ఎం కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ

సీకేదిన్నె, మార్చి 7 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఉమెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాంటీసెక్స్‌వల్ అ రాస్‌మెంట్ ఎస్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్, ట్రెజరీ కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావడం ద్వారానే వారి హక్కులను తెలుసుకుని సమాజంలో అణచివేతకు గురికాకుండా అన్నివిధాలా రాణించగలరన్నారు. ఉన్నతస్థాయికి చేరుకునేందుకు విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల ఎండీ చంద్ర ఓబుళరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఆత్మవిశ్వాసం మరింత పెరిగి విజయవంతంగా ముందుకు దూసుకుపోతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, మహిళా సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

'బీసీల ఉన్నతికే బీసీ డిక్లరేషన్'

చెన్నూరు, మార్చి 7 : బీసీల ఉన్నతికే బీసీ డిక్లరేషన్ ఏర్పాటు చేశారని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం తెలిపారు. చెన్నూరు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 50 సంవత్సరాలకే బీసీలకు పెన్షన్ ఇస్తామనడం అభినందనీయమన్నారు. బీసీ సెల్ మండల నేత గోగుల శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు ఆటోబాబు, క్రిష్ణయ్య, నరసింహాచారి, పవన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రతి బాలిక ఉన్నత విద్యావంతురాలు కావాలి: వీసీ




కడప: ఎస్టీయూ ఆధ్వర్యంలో మహిళలను సత్కరిస్తున్న దృశ్యం... మహిళా అధికారులకు సన్మానం



ప్రతిభ కనబరచిన ఉద్యోగులతో ఈడీ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి7: ప్రతి బాలిక ఉన్నత విద్యావంతురాలు కావాలని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతాసుధాకర్ తెలిపారు. గురువారం ఆర్ట్స్ బ్లాక్ సురభి సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వైవీయూ మహిళా సెల్ సమన్వయకర్త రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగి నిర్ణయాలు తీసుకునే స్థాయికి రావాలంటే ఉన్నత చదువులు ముఖ్యమన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో...

కడప నగరం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎస్టీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

ఇంటాక్ ఆధ్వర్యంలో...

కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళ అధ్యాపకులను సత్కరించారు. ఇంటాక్ లయన్ మానస కె.చిన్నపరెడ్డి, కోకన్వీనరు పీవీ సుబ్బారెడ్డి, ఇంటాక్ సభ్యులు కొండూరు జనార్థన్‌రాజు, కొండారెడ్డి, భారవి, రామవేంద్రవర్మ, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూలో మహిళలను సత్కరిస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు

వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూలో...

కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ పద్మ, డాక్టర్ చంద్రమతి శంకర్, డాక్టర్ కె.లలిత హాజరయ్యారు. అలాగే మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కడప (మారుతీనగర్) మార్చి 7:అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ కడప రీజియన్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్టీసీ డిప్యూటీ సీపీఎం గజలక్ష్మి అధ్యక్షతన గురువారం మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధారాణి బ్రహ్మకుమారి గీతా అక్కయ్య హాజరై మాట్లాడారు.

మహిళలు సాధికారత సాధించాలి

చెన్నూరు, మార్చి 7: మహిళలు ఆర్థికంగా, రాజకీయ సాధికారత సాధించాలని కడప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జీఎన్ భాస్కర్‌రెడ్డి అన్నారు.



చెన్నూరు: మహిళలను సన్మానిస్తున్న అరుణకుమారి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక స్త్రీశక్తి భవన్‌లో విజేత మహిళ మండలి అధ్యక్షురాలు అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అరుణకుమారి మాట్లాడుతూ మహిళలను అన్నిరకాల ఆదుకునేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందన్నారు.

విద్యుత్‌భవన్‌లో వేడుకలు

కడప (నాగరాజుపేట), మార్చి 7:అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం విద్యుత్ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్.రమణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ప్రతి మహిళా భావితరాలకు దిక్సూచి కావాలి: మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 7:ప్రతి మహిళా భావితరాలకు దిక్సూచిగా ఉండాలని టీడీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కడప నియోజకవర్గ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు తమ హక్కులను గుర్తించి మహిళా సమానత్వం, సాధికారత, సామాజిక మార్పుపై అవగాహన పెంచుకుని అభివృద్ధి వైపు అడుగులేయాలన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి

న్యాయసాధన ప్రతిజ్ఞలో జిల్లా కాంగ్రెస్ నేతలు



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు

కడప(కలెక్టరేట్), మార్చి 7: గుంటూరు జిల్లా మంగళగిరిలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న న్యాయసాధన ప్రతిజ్ఞ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరితో ఆమె ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా నుంచి డీసీసీ అధ్యక్షుడు జి.శ్రీరాములు, పీసీసీ డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధ్రువకుమార్ రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద ఆందోళన

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 7 : కడప ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద అర్హత ఉండి అన్యాయం జరిగిందని అభ్యర్థులు ఆందోళన నిర్వహించారు. గత డిసెంబరులో కొన్ని ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం అర్హతలు, మెరిట్ కలిగిన అభ్యర్థులకు కాకుండా అనర్హులకు ఉద్యోగాలు ఇస్తున్నారని, అర్హత కలిగిన తమకు న్యాయం చేయాలని రిమ్స్ వైద్యకళాశాల వద్ద ఆందోళన నిర్వహించారు.

'ఎమ్మెల్సీ అనంతబాబును బర్తరఫ్ చేయాలి'

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 7 :దళిత యువకుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును పదవి నుంచి బర్తరఫ్ చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం మరియాపురం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ అనంతబాబు, డ్రైవరు సుబ్రమణ్యంను చంపి డోర్ డెలివరీ చేయడం దుర్మార్గమన్నారు. ఆ ఎమ్మెల్సీ ఇప్పటికీ వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. తక్షణం ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆర్‌పీఐ దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి అజయ్ ప్రసన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంటు రాజేంద్రప్రసాద్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ట్రేడ్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో సీఐటీయూ జిల్లా శిక్షణా తరగతులు

కడప (నాగరాజుపేట), మార్చి 7 : సీఐటీయూ జిల్లా శిక్షణ తరగతులు నగరంలోని పాత బస్టాండులో గల సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ తెలిపారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.

మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి

కడప(కలెక్టరేట్), మార్చి 7:మహిళలు అన్నిరంగాల్లో ధైర్యంగా ముందడుగు వేయాలని సమాచార, పౌరసంబంధాల శాఖ ఏడీ పి.వేణు గోపాలరెడ్డి పేర్కొన్నారు. గురువారం సమాచార శాఖ కార్యాలయంలో ఉద్యోగినులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ వేణుగోపారెడ్డి మాట్లాడుతూ సాధికారత సాధన దిశగా ముందడుగు వేయాలన్నారు.

నిరుద్యోగులతో చెలగాటం తగదు: ఏఐవైఎఫ్

కడప (మారుతీనగర్), మార్చి 7: నిరుద్యోగులతో చెలగాటం తగదని అఖిల భారత యువజన సమాఖ్య సహాయ కార్యదర్శి గంగా సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీపీఎస్సీ గ్రూప్- 2 ప్రాథమిక పరీక్ష నుంచి ప్రధాన పరీక్షకు 1:100 నిష్పత్తిలో తీసుకోవాలని, గ్రూప్ 1 పరీక్షకు మరో మూడు నెలల సమయం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లు ఖాళీగా ఉండి గత డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చి సిలబస్‌కు తగ్గట్టు కనీస సమయం ఇవ్వకుండా పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దేవా రాహుల్, నగర అధ్యక్షుడు శివనాగేంద్ర, సహాయ కార్యదర్శి నాగార్జున, బి. సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి బీజేపీ నెంబర్ 1 ద్రోహి: తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 7:రాష్ట్రానికి బీజేపీ నెంబర్ 1 ద్రోహి అని 20 సూత్రాల కార్యక్రమం మాజీ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ఆయన వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టింది, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలిచ్చింది బీజేపీనేనన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలి'

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 7 :జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అర్హులైన వారికి కాకుండా అధికార పార్టీ నాయకుల సిఫారసులకు పెద్దపీట వేసిన నోటిఫికేషన్ రద్దు చేసి తిరిగి నోటిఫికేషన్ నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హోచిమన్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

వీరపునాయునిపల్లె, మార్చి 7: సంగమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. చలువపందిళ్లు, విద్యుత్ దీపాల అలంకరణ, బారికేడ్లు ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళ్యాణం, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుందని ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి తెలిపారు. భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించాలని ఆయన కోరారు.

జోరుగా టీడీపీలోకి చేరికలు

మైదుకూరు రూరల్, మార్చి 7 : మండలంలోని పప్పనపల్లె పంచాయతీ ఓబులవారిపల్లెకు చెందిన దాదాపు 15 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ఆనందరావు, బాలయ్య తదితరులు కలసి గురువారం వారు ప్రొద్దుటూరులోని సుధాకర్‌యాదవ్ నివాసానికి చేరుకొని పార్టీలో చేరారు.కార్యక్రమంలో భీమయ్య పాల్గొన్నారు


చాపాడులో టీడీపీలోకి చేర్చుకుంటున్న పుట్టా సుధాకర్‌యాదవ్

చాపాడు..: మండలంలోని సిద్దారెడ్డిపల్లె గ్రామానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలవారు గురువారం టీడీపీలో చేరారు. మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ వారికి పార్టీకండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డిగారి రాఘవరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఓబయ్య, ఈశ్వర్‌రెడ్డి, చిన్నవీరారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, గురప్ప, బాబయ్య, పుల్లయ్య, మరో 40 కుటుంబాలవారు ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి మాట్లాడుతూ మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దౌర్జన్యాలు, అక్రమాలతో విసుగుచెంది టీడీపీలో చేరినట్లు చెప్పారు.

మైలవరం..: మండల పరిధిలోని రామచంద్రాయపల్లి, బోగాలకట్ట, బొగ్గులదాసరిపల్లి గ్రామాల్లో గురువారం వైసీపీ నుంచి 100 కుటుంబాల వారిని టీడీపీ పార్టీ కండువా కప్పి జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్‌భూపేశ్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్‌లు పోలు గోపాల్ యాదవ్, గుర్రప్ప, రాముడు, గుర్రన్న, రాజు, లచ్చన్న, మస్తాన్,వెంకటమోహన్, సుబ్బరాయుడు, నాగేష్, శివ, చంద్ర, లక్ష్మీనారాయణ, శ్రీను, ముని, నాగేష్, మునిశేఖర్, కేశాల్, గురుస్వామి, గురుశేఖర్, పెద్దగుర్రప్ప, చిన్న సుబ్బరాయుడు, పగులు, రవి, బాల సుందరం,లక్ష్మణ్, సురేష్, వెంకటరమణ, దుబ్బరామిరెడ్డి, జయరామిరెడ్డి, వెంకటన్న, వెంకటశివుడు, పెద్ద వెంకటన్న, వినయ్, శ్రీకాంత్, మహేష్, సురేష్, శివ, మహేంద్ర, బాబునాయక్, రాముడు నాయక్, వీరు నాయక్,గురుశేఖర్, గుర్రప్ప, రామాంజల్, తదితరులు ఉన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ టీడీపీ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, కాటిరెడ్డి, పాపిరెడ్డి, కొండయ్య, సూర్యపెద్దిరాజు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో భూపేశ్‌రెడ్డి

ప్రొద్దుటూరు..: ప్రొద్దుటూరులో తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామని టీడీపీ నాయకుడు సీఎం సురేష్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం దొరసానిపల్లె రోడ్డులోని 40 వవార్డులో సురేశ్‌నాయుడుఆధ్వర్యంలో చౌడం రవి నేతృత్వంలో చౌడం లక్ష్మయ్య, హుస్సేన్‌బాషా, బండారు చౌడయ్య గుద్దేటి రాజా రమేష్ వినోద్ సుబ్బయ్యలతో పాటు వంద కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ ఛైర్మెన్ వీఎస్ ముక్తియార్, రాజుపాలెం మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మునీర్, మాజీ కౌన్సిలర్‌గంజికుంట ఆంజనేయులు,బీసీ నాయకుడు నల్లబోతుల నాగరాజు, జనసేన ప్రతినిధి జిలాన్, ఎర్రబల్లె దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం 21 వవార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుగారెంటీకార్యక్రమం సురేశ్‌నాయుడు ఆధ్వర్యంలో చేపట్టారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బాబయ్య, కాకితిరుపతమ్మ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.


సురేశ్‌నాయుడుఆధ్వర్యంలో టీడీపీలో చేరికలు

దువ్వూరు (మైదుకూరు)..: దువ్వూరుకు చెందిన వైసీపీ నాయకులు షేక్ సద్దాం హుస్సేన్, మహబూబ్‌పీరా, యమ్ బాషా, ఆశ్రవలి, దస్తగిరి తదితర దాదాపు 25 కుటుంబాల వారు గురువారం రాత్రి టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. మండల టీడీపీ అధ్యక్షుడు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, రాంబాబు, తాహిర్ హుస్సేన్, హుసేనయ్య పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన టీడీపీతోనే సాధ్యం

ప్రొద్దుటూరు, మార్చి 7 : మహిళల ఆర్థిక స్వావలంబన టీడీపీతోనే సాధ్యమని టీడీపీ జిల్లా మహిళా కార్యదర్శి కోటశ్రీదేవి పేర్కొన్నారు. గురువారం పద్మశాలీయ కళ్యాణ మండపంలో మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ నాయకురాళ్లు మౌనికారెడ్డి, హరితారెడ్డి ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు జరిపారు. టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు బోగాల లక్ష్మీనారాయణమ్మ, పల్లా లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

బద్వేలు టౌన్, మార్చి 7 : చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ద్వారా అభివృద్ధి సాధ్యమని టీడీపీ యువనేత రితీష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. గురువారం ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా మున్సిపల్ పరిధిలోని పూలబావివీధి, మెయిన్‌బజారు, దర్గావీధి తదితర కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మన్ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, డాక్టర్ క్రాంతికుమార్, ప్రముఖ న్యాయవాది వీవీఎస్ ప్రసాద్, వెంకటసుబ్బయ్య, నానబాల వెంకటేశ్వర్లు. జహంగీర్‌బాషా, సింగసాని విజయ్, గురురాజా, నాగభూషణం, మాచుపల్లె లక్ష్మీదేవి, ఆదిలక్షుమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

చాపాడు, మార్చి 7: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి రెండు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ దేవస్థానం ఈవో శ్రీనివాసులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయి ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. గెలుపొందిన ఎద్దులకు మొదటి బహుమతి రూ.1,00,116, రెండో బహుమతి రూ.70,116, మూడో బహుమతి రూ.60,116 ఇస్తున్నట్లు వారు తెలిపారు.

టీడీపీ ప్రచారరథం ప్రారంభించిన పుట్టా

మైదుకూరు, మార్చి 7 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచార రథాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ గురువారం ప్రారంభించారు. ప్రొద్దుటూరులోని తన కార్యాలయం ఆవరణలో నాయకులతో జెండా ఊపి ప్రారంభించారు.

టీడీపీ గెలుపు ఖాయం

ప్రొద్దుటూరు ,మార్చి 7 : రాష్ట్రంలో వైసీపీ ఓటమి, టీడీపీ గెలుపు ఖాయమయ్యాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గోపవరం పంచాయతీలోని ఉప్పాగు యానాది కాలనీలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ చేపట్టారు. కార్యక్రమంలో బాబుల్ రెడ్డి, ధనిరెడ్డి విశ్వనాధరెడ్డి,బండి భాస్కర్‌రెడ్డి, పర్వీన్,సుబ్బరాయుడు, మస్తాన్, శివ,అస్సన్,సుబ్బయ్య,ఇమామ్ బాషా, మౌలాలిపాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd Proddatur branch issues the following notice to the general public. My client intend to grant loan to Sri **Donthu Venkata Subbaiah S/o Subramanyam** Residing at dno:12/118-A Badvel road Mydukuru Kadapa dist by mortgage. As such if anyone has any claims ,objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the ragard **SCHEDULE OF THE PROPERTIES:** Kadapa dist Mydukuru Registration district Mydukuru Sub District Mydukuru Muncipality S.Mydukuru Village Accounts Ward No:6 Revenue Colony area Nera Dno:6/782 Sy No:659 up an Extent Ac 0.04 or 193.6 Sq yards Bounced on **BOUNDARIES** ; EAST : Ankal Ramaiah Land, WEST: 16feets width road, NORTH :Site of G.Ravi kumar, SOUTH :Subbaiah 2nd item property, **II ITEM :** Sy No:659 up an Extent Ac 0.12 or 580.8.6 Sq yards Bounded **BOUNDARIES :** EAST :S.Ankal Ramaiah Land WEST : 16feets width road, NORTH: Subbaiah 1ST item property, SOUTH : Land of others

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

PUBLIC NOTICE

Iam instructed by my client M/s Shriram Finance Ltd., Badvel Branch, rep. by its Manager, the public si nodified as follows : Sri one **Kommineni Muddu Krishnama Naidu** S/o **Late Venkata Subbaiah,** r/o D.No. 3/5,B. Kamavaripalli Village, Eguvalelatur Post, B.Mattam Mandal, Kadapa Dt. has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any righ/possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. **Particulars of Property ;** Kadapa Dt., Kadapa Registration District, Badvel Sub-District, B.Mattam Mandal, Nagisettipalli Panchayat, Nagisettipalli Village fields, Sy.No. 150, 258.33 Sq. Yards (ac. 0.05.33 cents) out of 435.55 Sq. Yards out of Ac. 2.48 cents **Boundaries ;** East - Road, South - Site of Gundluru Bhanu Prakash, West - Land of Jony Bala Sundaram in Sy.No. 147, North - Site of Malli Obulesu **Measurements ;** East - West - 75 Feet (22.86 Mtrs.) North - South - 31 Feet (9.45 Mtrs.) -Totalling to 258.33 Sq. Yards - with all easement rights

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL